సాక్షి నిజామాబాద్

ఆదివారం । 10 । సెప్టెంబర్ । 2023



'గమ్యం'తో ప్రయాణం సులభం

బస్సు ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు ఆర్టీసీ 'గమ్యం' పేరుతో యాప్‌ను రూపొందించింది.

- 10లో ▸



అయినోళ్లకే స్థలాలిస్తారా..?

బాల్కొండలో ఇళ్ల స్థలాల పంపిణీలో అర్హులకు అన్యాయం జరిగిందని పేర్కొంటూ లబ్ధిదారులు రోడ్డెక్కారు.

- 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
28.9 /23.1

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం నుంచి మేఘావృతమై ఉండవచ్చు. సాయంత్రం మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

12న పెన్షన్ అదాలత్

నిజామాబాద్ సిటీ : ఉద్యోగుల పెన్షన్ స్కీమ్ పెన్షనర్ల సమస్యలకు సంబంధించిన పెన్షన్ అదాలత్ ఈనెల 12న నిర్వహిస్తున్నట్లు పీఎఫ్ కార్యాలయం సహాయక కమిషనర్ బి మధుసూదనాచారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 12న ఉదయం 11 గంటల నుంచి 11.40 గంటల వరకు పెన్షన్ అదాలత్ జరుగుతుందని పెన్షనర్ల సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫిర్యాదుదారులు వెబెక్స్ వెబ్‌సైట్‌లో మీటింగ్ నంబర్ 2640 3003615, పాస్‌వర్డ్ enf1234 ఎంటర్ చేసి కాన్ఫరెన్స్‌లో పాల్గొనాలన్నారు.

సెంట్రల్ సెక్రటేరియట్ అధికారుల రాక



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : భారత్ దర్శన్ కార్యక్రమంలో భాగంగా కేంద్రప్రభుత్వ సెంట్రల్ సెక్రటేరియట్ విభాగానికి చెందిన 15 మంది అసిస్టెంట్ సెక్షన్ ట్రెయినీ అధికారులు శనివారం జిల్లాకు వచ్చారు. విలేజ్ అటాచ్‌మెంట్ మాడ్యూల్ కింద డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ ద్వారా ఈ ట్రెయినీ అధికారులు ఈనెల 13వ తేదీ వరకు జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్ల పరిధిలోని మూడు గ్రామాల్లో స్టడీ చేయనున్నారు. ఇందులో భాగంగా బోధన్ రెవెన్యూ డివిజన్‌లోని రుద్రూర్ మండలం అక్బర్‌నగర్, నిజామాబాద్ రెవెన్యూ డివిజన్‌లోని సిరికొండ మండలం పోతుకూరు ఆర్మూర్ రెవెన్యూ డివిజన్‌లోని భీంగల్ మండలం పిప్రి గ్రామాల్లో బస చేయనున్నారు. ఒక్కో గ్రామంలో ఐదుగురు చొప్పున సెంట్రల్ సెక్రటేరియట్ అధికారులు ప్రభుత్వ పథకాల అమలు, వ్యవసాయం, ప్రజల అవసరాలు తదితరాలపై క్షుణ్ణంగా స్టడీ చేయనున్నారు. వీరికి మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల విభాగం రీజినల్ ట్రెనింగ్ మేనేజర్ వాకా వసుంధరా దేవి, డీఆర్‌డీవో చందర్‌నాయక్ స్వాగతం పలికారు. 13వ తేదీన ట్రెయినీ అధికారులు కలెక్టర్‌తో కలిసి తమ అనుభవాలను పంచుకుని, తర్వాత స్టడీ నివేదికను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అందించనున్నారు. రుద్రూర్, భీంగల్, సిరికొండ మండలాల ఎంపీడీవోలు బాలగంగాధర్, రాజేశ్వర్, లక్ష్మీప్రసాద్ ఉన్నారు.

13న ఉమ్మడి జిల్లా ఆర్చరీ పోటీలు

దోమకొండ: మండల కేంద్రంలోని గడికోటలో ఈనెల 13న ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఆర్చరీ పోటీలను నిర్వహించనున్నట్లు కోచ్ ప్రతాప్ దాస్ తెలిపారు. అండర్ -14, 17, 19 విభాగాలలో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు 13వ తేదీ ఉదయం 8 గంటలలోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని, ఇతర వివరాలకు 97051 41241 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నిజాంసాగర్‌లోకి 9వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టులోకి శనివారం 9 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు ఒక వరద గేటు ద్వారా 7 వేల క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోకి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 17.8 టీఎంసీలు కాగా శనివారం సాయంత్రానికి 17.441 టీఎంసీల నీరుంది.

లోకాయుక్త ఎదుట గైర్హాజరైన జీజీహెచ్ సూపరింటెండెంట్

ఖలీల్‌వాడి : జీజీహెచ్‌లో రెమిడిసివిర్ ఇంజెక్షన్ల గోల్‌మాల్‌పై ఆర్టీఐ సామాజిక కార్యకర్త రాజశేఖర్ లోకాయుక్తను ఆశ్రయించిన విషయం తెలిసిందే. అయితే ఈ ఇంజెక్షన్లకు సంబంధించి జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ శనివారం లోకాయుక్త ఎదుట హాజరుకావాల్సి ఉండగా ఆమె గైర్హాజరయ్యారు. రెండు నెలల క్రితం కూడా లోకాయుక్త ఎదుట హాజరుకావాల్సి ఉండగా గైర్హాజరయ్యారు. వచ్చేనెల హాజరవ్వాలని అధికారులు ప్రకటించినట్లు రాజశేఖర్ తెలిపారు.

ధ్రువపత్రాల పరిశీలన



నిజామాబాద్ అర్బన్ : పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం ఐసెట్ ప్రవేశాల కోసం విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. 425 మంది విద్యార్థులకు ధ్రువపత్రాల పరిశీలన చేసినట్లు కౌన్సెలింగ్ కన్వీనర్ శ్రీరామ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ధ్రువపత్రాలు పరిశీలన తర్వాత ఈనెల 13వ తేదీ వరకు కళాశాలలను ఎంపిక చేసుకునే అవకాశముంది.

చిన్నికృష్ణుడి మరో ఘనత!

- పరిశోధనలకు నలుపు, ఎరుపు బియ్యం విత్తనాలు తీసుకెళ్లిన జాతీయ పోషకాహార సంస్థ శాస్త్రవేత్తలు
- ఇందూరులో సేంద్రియ సాగు చేస్తున్న ఆదర్శ రైతు
- ఇదివరకే దేశ విదేశాల నుంచి వరించిన అవార్డులు, రివార్డులు, గౌరవ డాక్టరేట్



చిన్నికృష్ణుడి వ్యవసాయ క్షేత్రం



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ఇందూరు జిల్లా చింతలూరుకు చెందిన ఆదర్శ రైతు చిన్నికృష్ణుడు (నాగుల చిన్నగంగారాం) సేంద్రియ సాగు విధానంతో 110కి పైగా దేశీ వరి విత్తనా లను పండించి దేశంలోని వివిధ రాష్ట్రాల రైతులకు అందిస్తున్నారు. ఈ క్రమంలో చిన్నికృష్ణుడు దేశ విదేశాల నుంచి అనేక అవార్డులు, రివార్డులు, గౌరవ డాక్టరేట్ పొందారు. ఈ క్రమంలో వ్యవసాయ విశ్వ విద్యాలయం శాస్త్రవేత్తలు సైతం చిన్నికృష్ణుడు వద్ద పాఠాలు నేర్చుకునేందుకు వచ్చి వెళుతున్నారు.

ఇదిలా ఉండగా హైదరాబాద్‌లోని జాతీయ పోషకాహా ర సంస్థ (ఎన్‌ఐఎన్) శాస్త్రవేత్తలు సైతం ఈ ఆదర్శ రైతు పండిస్తున్న నలుపు బియ్యం (బ్లాక్ రైస్), ఎరు పు బి య్యం (ఎరుపు రైస్) పరిశోధ న కోసం తీసుకెళ్లారు. మొలకలు వచ్చే నలుపు రకం బియ్యం 6 రకాలు, ఎరుపు రకం బియ్యం 11 రకా లు (మొత్తం 17 రకాలు) తీసుకెళ్లారు. ఒక్కో రకం బియ్యం 4 కిలోల చొప్పున మొత్తం 68 కిలోలు తీసుకెళ్లారు.

మరో నెల రోజుల్లో వీటిపై చేసిన పరిశోధన ఫలితాలకు సంబంధించిన 'పరిశోధన పత్రాల'ను ప్రచురించనున్నారు.



పొలంలో పాఠశాలల విద్యార్థులు



"పాలిష్ చేయకపోతే బియ్యంలో ప్రాణశక్తి..

నలుపు, ఎరుపు రకాల బియ్యం నుంచి మొలకలు వస్తాయి. పాలిష్ చేయకుండా ఉంటే ఆ బియ్యంలో ప్రాణశక్తి ఉంటుంది. మొలకలు వస్తాయి. ఇలాంటి నలుపు, ఎరుపు రకం బియ్యానికి పురుగు రాదు.


– చిన్నికృష్ణుడు

నలుపు బియ్యం.. 6 రకాలు..



- **కాలబట్టి:** ఇది 160 రోజుల పంట. దీని కాండం సైతం నల్లగానే ఉంటుంది. ఈ బియ్యం క్యాన్సర్ నివారిణిగా పనిచేయడంతో పాటు బలవర్ధకమని పరిశోధనల్లో వెల్లడైంది.
- **పర్పుల్:** 140 రోజుల పంట. ఈ అన్నం సువాసన వస్తుంది. పరమాన్నం వండితే బాగుంటుంది.
- **కర్పూకౌని:** 135 రోజుల పంట. ఊబకాయం తగ్గిస్తుంది.
- **గంగాజపానిక్:** 110 రోజుల పంట. ఈ బియ్యం మూడు భాగాలు నల్లగా, ఒక భాగం ఎర్రగా ఉంటుంది.. బలవర్ధక ఆహారం.
- **కృష్ణవీహి:** 120 రోజుల పంట. బలవర్ధకం. ఆరోగ్యానికి మంచిది.
- **కళావట్:** 135 రోజుల పంట. బలవర్ధకం.

ఎన్‌ఐఎన్ తీసుకెళ్లిన ఎరుపు బియ్యం.. 11 రకాలు



- **రక్తశాలి:** 110 రోజుల సన్నరకం పంట. రక్తంలో హిమోగ్లోబిన్ పెంచుతుంది.
- **నవారా:** 120 రోజుల పంట. షుగర్ రాకుండా చేస్తుంది. షుగర్ ఉంటే నియంత్రిస్తుంది.
- **కులాకర్:** 110 రోజుల పంట. గర్భిణులకు సాధారణ ప్రసవం అయ్యేలా పనిచేస్తుంది.
- **రూబీ రెడ్‌రైస్:** ఇది 170 రోజుల పంట. ఎర్రగా బాస్మతి బియ్యంలా ఉంటాయి. వీటిల్లో చిరుధాన్యాల మాదిరిగా ఫైబర్ కలిగి ఉంటుంది.
- **ఔషధ ఎర్ర బియ్యం:** 105 రోజుల పంట. ఆరోగ్యానికి మంచిది.
- **రామ్‌లక్ష్మణ్:** 125 రోజుల పంట. దీని ఒక్కో వడ్ల గింజలో రెండు బియ్యం గింజలు ఉంటాయి.
- **పంచరత్న:** 135 రోజుల పంట. ఈ బియ్యం, కాండం, కంకి ఎర్రగానే ఉంటాయి.
- **బుదుమ:** 100 రోజుల పంట. నేరుగా చల్లుకునే వర్షాధార పంట.
- **మాపిళ్లెసాంబ:** 240 రోజుల పంట. సంతానం కానివారికి అయ్యేలా చేస్తుంది. అత్యంత శక్తిమంతం. మహిళలకు అండాశయం విడుదల, పురుషుల్లో వీర్యకణాల వృద్ధి చేస్తాయి. ఏపీ, ఒడిశాలో ఈ బియ్యం తిని సంతానం పొందిన జంటలు ఉన్నాయి. ఈ బియ్యం గంటసేపు నానబెడితే సరిపోతుంది. మిగిలిన నలుపు, ఎరుపు బియ్యం నాలుగు గంటలు నానబెట్టాలి.
- **గంగా ఎరుపు బియ్యం:** 135 రోజుల పంట. ప్రతి బియ్యం గింజ మధ్యలో బొట్టు పెట్టినట్టు చుక్క ఉంటుంది.
- **లాయిచా.2:** 140 రోజుల పంట. బాలింతలు ఈ అన్నం తింటే పాలు పెరుగుతాయి.

రైల్వేస్టేషన్ అభివృద్ధికి కృషి



రైల్వే స్టేషన్‌ను పరిశీలిస్తున్న జీఎం అరుణ్‌కుమార్ జైన్

- దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్
- ప్రయాణికుల సౌకర్యాల పరిశీలన

ఖలీల్‌వాడి : నిజామాబాద్ రైల్వేస్టేషన్‌ను అమృత్ భారత్ నిధులతో మరింత అభివృద్ధి చేస్తామని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ పేర్కొన్నారు. నగరంలోని రైల్వేస్టేషన్‌ను శనివారం ఆయన తనిఖీ చేశారు. నిజామాబాద్ రైల్వేస్టేషన్ అభివృద్ధి కోసం అమృత్‌భారత్ స్కీంలో భాగంగా నిధుల కేటాయింపులపై రైల్వే అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని క్రూ కంట్రోల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరును తెలుసుకున్నారు. సిబ్బందిని సరైన పద్ధతిలో వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు. లోకోపైలట్లతో సంభాషించారు. స్టేషన్ మేనేజర్ రన్నింగ్ రూం వద్ద ఆయన మొక్కలు నాటారు. జనరల్ మేనేజర్ స్టేషన్‌లోని సర్క్యులేటింగ్ ప్రాంతాన్ని కూడా పరిశీలించారు. స్టేషన్‌లోని యాక్సిడెంట్ రిలీఫ్ రైలు, మెడికల్ రిలీఫ్ వ్యాన్‌ను, గూడ్స్‌షెడ్, గ్యారేజ్ వ్యాగన్ డిపోను పరిశీలించారు. నిజామాబాద్ నుంచి సికింద్రాబాద్ స్టేషన్ వరకు రియర్ విండో ద్వారా తనిఖీని నిర్వహించిన ఆయన ట్రాక్‌లు, సిగ్నలింగ్ వ్యవస్థను తనిఖీ చేశారు. ఈ తనిఖీలో హైదరాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ లోకేష్ విష్ణోయ్, ఇతర ఉన్నతాధికారులు కలిసి ఉన్నారు.

సరిహద్దుల్లో పటిష్ట నిఘా

- రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో..
- ఆరు జిల్లాల పోలీసు అధికారులు, మహారాష్ట్ర పోలీసుల సమీక్ష
- మద్యం, నగదు సరఫరా కట్టడికి తీసుకోనున్న చర్యలు



సమీక్షలో మాట్లాడుతున్న సీపీ సత్యనారాయణ



పాల్గొన్న జిల్లాల ఎస్పీలు, వివిధ శాఖల అధికారులు

బోధన్‌టౌన్(బోధన్) : రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర, జిల్లాల సరిహద్దుల్లో చేపట్టే పకడ్బందీ చర్యలపై శనివారం బోధన్ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధి సాలూర రోడ్డులోని ఎస్ఎస్ కన్వెన్షన్ హాలులో మహారాష్ట్ర పోలీసులతో పాటు, నిజామాబాద్ సీపీ, ఐదు జిల్లాల ఎస్పీల సమావేశం జరిగింది. నిజామాబాద్ సీపీ పోలీస్ కమిషనర్ వి సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా సరిహద్దుల్లో చెక్ పోస్టులను ఏర్పాటు చేసి మద్యం, నగదు సరఫరాపై నియంత్రణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.తనిఖీలు నిర్వహిస్తూ గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల రవాణాను నియంత్రించాలన్నారు. నిజామాబాద్, నిర్మల్, అదిలాబాద్, కామారెడ్డి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, నాందేడ్ జిల్లా సరహద్దుల్లో ఉన్న సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు చేయాలన్నారు. నాన్ బెయిలబుల్ వారెంట్ విషయంలో ఇరు జిల్లాల, రాష్ట్రాల అధికారులు సహకరించుకుంటూ ముందుకు వెళ్లాలన్నారు. అంతర్రాష్ట్ర చెక్ పోస్టులైన సాలూర, కండ్గావ్, కందకుర్తి, పోతంగల్ వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అంతర్ జిల్లా చెక్ పోస్టులు డోర్గాన్ (సోన్) బ్రహ్మంగారి గుట్ట, సిరికొండ, ఇందల్వాయి టోల్‌ప్లాజా, మల్లారం గండి, యంచ (బాసర)ల వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. హైవే పెట్రోలింగ్, మొబైల్ పెట్రోలింగ్ పెంచాలని, పోలీస్ అధికారులు వాట్సప్‌గ్రూప్‌లను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించాలన్నారు. సమావేశంలో ఆయా జిల్లాల ఎస్పీలు డి ఉదయ్ కుమార్, ప్రవీణ్ కుమార్,భాస్కర్, బి శ్రీనివాస్, నాందేడ్ జిల్లా అదనపు ఎస్పీ కేఏ ధరణి, అదనపు డిప్యూటీ కమిషనర్ జయరామ్,కమర్షియల్ ట్యాక్స్ అధికారిణి లావణ్య, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి, స్పెషల్ బ్రాంచ్ అధికారులు, రోడ్డు, ట్రాన్స్‌పోర్టు, ఫారెస్టు, రెవిన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చర్యలేం తీసుకున్నారు..?

- బట్టాపూర్ గుట్ట అక్రమ మైనింగ్‌పై గనులశాఖకు ఎస్ఈఐఏఏ లేఖ
- ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అండ్ టెక్నాలజీ స్పెషల్ చీఫ్ సెక్రటరీకీ..
- ఇప్పటికే గుట్ట తవ్వకాలను సీజ్ చేయించిన ఉన్నత న్యాయస్థానం
- ఈ నెల 12న హైకోర్టులో విచారణ



బట్టాపూర్ క్వారీ

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : జిల్లాలోని ఏర్గట్ల మండలంలో గల బట్టాపూర్ గుట్ట అక్రమ తవ్వకాలు, క్రషింగ్‌ను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి గత జూలై మొదటి వారంలో సీజ్ చేయించిన నేపథ్యంలో తదుపరి తీసుకున్న చర్యలేమిటంటూ భారత ప్రభుత్వం ఆధీనంలోని స్టేట్ లెవెల్ ఎన్విరాన్‌మెంట్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ అథారిటీ (ఎస్ఈఐఏఏ) రాష్ట్ర గనుల శాఖకు లేఖ రాసింది. ఈ లేఖను 2017 ఆగస్టు 2న రిట్ పిటిషన్(సివిల్) నంబర్ 114(2014) మేరకు సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలతో ఇచ్చారు. మరోవైపు హైకోర్టు ఆదేశాల మేరకు తీసుకున్న చర్యల గురించి నివేదిక ఇవ్వాలంటూ రాష్ట్ర ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం స్పెషల్ చీఫ్ సెక్రటరీకి ఎస్ఈఐఏఏ లేఖ రాసింది. కాగా హైకోర్టు ఆదేశాలతో జూలై నెలలోనే స్టేట్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ సెక్రటరీ నుంచి క్వారీ నిర్వాహకుడు శ్రీ కాంత్‌రెడ్డికి మూసేయాలని ఆదేశాలు వచ్చాయి. విద్యుత్ సరఫరా తొలగించాలంటూ నిజామాబాద్ ట్రాన్స్‌కో ఎస్ఈకి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆదేశాలిచ్చింది. ఇదిలా ఉండగా ఇప్పటికీ జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించి క్రషర్‌కు సంబంధించిన విద్యుత్ బిల్లు మాత్రం రూ.13,91,023 పెండింగ్‌లో ఉండడం గమనార్హం. తవ్వకాలను నిలిపేసిన విషయమై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు హైకోర్టుకు నివేదిక అందజేశారు. కాగా అక్రమంగా చేసిన తవ్వకాలకు సంబంధించి విచారణను హైకోర్టు ఈ నెల 12కు వాయిదా వేసింది. శ్రీకాంత్‌రెడ్డి (క్వారీ), జియోస్టోన్ ఇండస్ట్రీ (క్రషర్)లకు ఇప్పటికే నోటీసులు జారీ అయ్యాయి. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాధే, జస్టిస్ వినోద్‌కుమార్ ధర్మాసనం ఈ విచారణ చేపట్టనుంది.

తవ్వుకున్న మొత్తం, జరిమానా, పర్యావరణ విధ్వంసం పరిహారం..

మైన్స్ అండ్ మినరల్స్ డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేషన్ యాక్ట్ 1957 ప్రకారం సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేసేందుకు ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీని ప్రకారం 9,280 క్యూబిక్ మీటర్ల మేర తవ్వకాలకు మాత్రమే అనుమతులు తీసుకుని అక్రమంగా 15 లక్షల క్యూబిక్ మీటర్లు తవ్వినట్లు ఎలక్ట్రానిక్ టోటల్ సర్వేలో తేల్చడం జరిగింది. దీంతో సెక్షన్ 21(5) మైన్స్ అండ్ మినరల్స్ డెవలప్‌మెంట్ యాక్ట్, 1957 ప్రకారం అక్రమ మైనింగ్ ఎంత చేస్తే అంతమేరకు ఒక్కో క్యూబిక్ మీటర్‌కు రూ.800 ధర చొప్పున ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది.

ఈ ప్రకారం 15 లక్షల క్యూబిక్ మీటర్లకు రూ.120 కోట్ల మేర చెల్లించడంతో పాటు గనుల శాఖకు జరిమానాగా రూ.67 కో ట్లు చెల్లించాల్సి ఉంటుందని నిపుణులు చెబుతున్నా రు. పైగా పర్యావరణాన్ని దెబ్బతీసినందుకు ఎన్విరాన్‌మెంట్ బోర్డు, వైల్డ్‌లైఫ్ బోర్డు నిర్దేశించే ప రిహారాన్ని కూడా చెల్లించాల్సి ఉంటుందంటున్నారు.

రైతులు, స్థానిక మిల్లర్లకు అన్యాయం

- బిడ్‌లో పాల్గొనే అవకాశం లేకుండా ధాన్యం వేలం ప్రక్రియ సరికాదు
- వ్యవస్థను దెబ్బతీస్తున్న కేసీఆర్ ప్రభుత్వం
- మాజీ మంత్రి, పీసీసీ కోశాధికారి సుదర్శన్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : దేశంలో బియ్యానికి డిమాండ్ ఉన్నందున కేంద్ర ప్రభుత్వం బియ్యం ఎగుమతులపై నిషేధం విధించిన నేపథ్యంలో, కేసీఆర్ ప్రభుత్వం వ్యవస్థను దెబ్బతీసే విధంగా 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వేలం ప్రక్రియను స్వార్థపూరిత విధానంలో చేపట్టడం సరికాదని మాజీ మంత్రి, పీసీసీ కోశాధికారి పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం ప్రభుత్వమే ధాన్యాన్ని కొనుగోలు చేస్తూ, మరోవైపు ప్రభుత్వమే రైస్‌మిల్లులు ఏర్పాటు చేస్తామని చెబుతూనే, బయటి నుంచి వచ్చే వారు మాత్రమే బిడ్‌లలో పాల్గొనేలా ప్రక్రియ చేపట్టడం పద్ధతి కాదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులకు నష్టం జరగడంతో పాటు రాష్ట్రంలోని రైస్ మిల్లర్లకు నష్టం కలుగుతుందన్నారు.స్థానిక మిల్లర్లు పర్చేజింగ్ ధరకు తీసుకుంటామని చెబుతున్నప్పటికీ, ఇక్కడి మిల్లర్లు బిడ్డింలో పాల్గొనే అవకాశం లేకుండా కనీసం రూ.200 కోట్ల టర్నోవర్ ఉన్నవారు మాత్రమే బిడ్డింగ్‌లో పాల్గొనేలా నిబంధనలు పెట్టడం సరికాదన్నారు. భవిష్యత్తులో బియ్యం ధర భారీగా పెరిగే ప్రమాదం ఉందన్నారు. క్వింటాకు రూ.300 నుంచి రూ.400 వరకు కమీషన్లు దండుకునేందుకే కేసీఆర్ ప్రభుత్వం ఇలా భారీ టెండర్లు పెట్టి బయటి సంస్థలకు కేటాయిస్తున్నారన్నారు. గతంలోనూ కేసీఆర్ ప్రభుత్వం మొక్కజొన్నల విషయంలో ఇలాగే చేసి ధరను తగ్గేలా చేయడంతో రైతులకు నష్టం కలిగిందన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం పర్చేజింగ్ సిస్టమ్‌ను బలోపేతం చేయడంతో ధాన్యం కనీస ధర క్వింటా రూ.560 నుంచి 1,400 వరకు తీసుకురావడంతో రైతులకు మేలు కలిగిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రం రైతులకు నష్టం చేసేలా చేస్తోందన్నారు. పీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్ హందాన్, పొద్దుటూరి వినయ్ రెడ్డి, అరికెల నర్సారెడ్డి, కిక్ గంగారెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు వాస్తవ చరిత్రపై ఉపన్యాసం



నిజామాబాద్‌ సిటీ: ఇతిహాస సంకలన సమితి ఆధ్వర్యంలో నగరంలోని న్యూ అంబేద్కర్‌ భవన్‌లో 'తెలంగాణ విమోచన దినం – వాస్తవ చరిత్ర' పై ఉపన్యాస కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు సంస్థ ప్రతినిధులు కందకుర్తి ఆనంద్‌, చిలుమల మోహన్‌ దాస్‌ తెలిపారు. శనివారం ఆనంద్‌ నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. తెలంగాణ పోరాటానికి భారత స్వాతంత్య్ర పోరాటానికి ఎంతో వ్యత్యాసం ఉందని అన్నారు. తెలంగాణ ప్రాంతాన్ని హైదరాబాద్‌ సంస్థానంగా నిజాం కుటుంబం ఏడు తరాలు పరిపాలించాయని తెలిపారు. కార్యక్రమానికి తెలంగాణ, స్వాతంత్య్ర పోరాటయోధులు, ప్రముఖులు హాజరవుతారని అన్నారు. కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు, అధ్యాపకులు, కవులు, అధికారులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఎస్సారెస్పీలోకి తగ్గిన వరద



బాల్కొండ: ఎస్సారెస్పీలోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద తగ్గుముఖం పట్టింది. దీంతో ప్రాజెక్ట్‌ నుంచి వరద గేట్ల ద్వారా గోదావరిలోకి నీటి విడుదలను తగ్గించారు. ఎగువ ప్రాంతాల నుంచి 30 వేల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్ట్‌ నుంచి 8 వరద గేట్ల ద్వారా 25 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు గోదావరిలోకి వదులుతున్నారు. ఎస్కేప్‌ గేట్ల ద్వారా 5 వేల క్యూసెక్కులు, కాకతీయకాలువ ద్వారా 3 వేలు, మిషన్‌ భగీరథ ద్వారా 152, ఆవిరి రూపంలో 666 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్‌ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(90 టీఎంసీలు) అడుగులు కాగా శనివారం సాయంత్రానికి అంతే స్థాయి నీటి మట్టం ఉంది.

ఎల్లారెడ్డిలో కూలిన ఇల్లు



ఎల్లారెడ్డి: పట్టణంలోని ఇందిరానగర్‌లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కాలనీకి చెందిన మర్లు సంగవ్వ ఇల్లు కూలిపోయిందని కాలనీవాసులు శనివారం తెలిపారు. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరారు.

చెక్‌డ్యాం మొరం కట్టకు గండి



వేల్పూర్‌: మండలంలోని కొత్తపల్లి (ఎస్‌), జక్రాన్‌పల్లి మండలం కొలిప్యాక్‌ గ్రామాల మధ్య పెద్దవాగుపై నిర్మించిన చెక్‌డ్యాం మొరంకట్టకు కొత్తపల్లి వైపు శుక్రవారం రాత్రి గండి పడింది. ఈ గండితో పక్కనే ఉన్న కొత్తపల్లి రైతులకు చెందిన పసుపు, మొక్కజొన్న పంటలు కోతకు గురవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షానికి రామడుగు ప్రాజెక్టు నుండి వరద రావడమే కాకుండా స్థానికంగా కలుస్తున్న వరద చెక్‌డ్యాంలో అధికమై మొరంకట్ట తెగినట్లు రైతులు పేర్కొంటున్నారు. తెగిన చెక్‌డ్యాం మొరం కట్టను ఇరిగేషన్‌ ఈఈ భాను ప్రకాశ్‌ పరిశీలించారు. సుమారు 25 మీటర్ల మేర మొరం కట్ట తెగిపోయినట్లు గుర్తించారు.

అయినోళ్లకే ఇళ్ల స్థలాలిస్తారా..?

అర్హులను పట్టించుకోరా..?
- మోర్తాడ్‌, ఏర్గట్ల మండలాల్లో ఇళ్ల స్థలాల పంపిణీలో అధికార పార్టీ నాయకుల ముద్ర
- రోడ్డెక్కిన బాధితులు

మోర్తాడ్‌(బాల్కొండ) : వడ్డించేవారు మన వారైతే ఏ మూల కూర్చున్నా విందు భోజనం పుష్టిగా తినొచ్చు అనే నానుడి మాదిరిగానే తయారైంది ఇళ్ల స్థలాల కేటాయింపుల వ్యవహారం. బీఆర్‌ఎస్‌ పాలనలో రాజకీయాలకు అతీతంగానే సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందుతున్నాయని మంత్రి ఇటీవల ఇళ్ల స్థలాల పట్టా సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమంలో వ్యాఖ్యానించారు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే మాత్రం అధికార పార్టీ నాయకులను ప్రసన్నం చేసుకున్నవారికే పథకాలు, ఇళ్ల స్థలాల అందుతున్నాయని స్పష్టమవుతోంది. పాలెంలో 95 మందికి, తిమ్మాపూర్‌లో 85, ఏర్గట్ల మండలం తడపాకల్‌లో 31, తాళ్లరాంపూర్‌లో 22 మందికి గతంలో సేకరించిన భూముల్లో ఇళ్ల స్థలాలను కేటాయించారు. ఈ కేటాయింపులో అధికార పార్టీ ముద్ర స్పష్టంగా ఉందని ఆ పార్టీ నాయకుల కటాక్షం లేనివారికి ఇళ్ల స్థలాలు దక్కలేవని వెల్లడవుతోంది. పాలెంలో దాదాపు 50 మంది అర్హత లేనివారికి ప్లాట్లు లభించినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. తిమ్మాపూర్‌లో పది మంది వరకు, ఇతర చోట్ల కూడా కొంత మందికి ఇళ్ల స్థలాలు పొందే అర్హత లేకపోయినా నాయకుల ప్రోద్బలంతో అధికారులు పట్టా సర్టిఫికెట్‌లను జారీ చేసినట్లు ప్రచారం జరుగుతుంది. పాలెంలో జరిగిన అక్రమాలపై అనేక మంది అర్హులు తహసీల్దార్‌ కార్యాలయానికి వచ్చి ఆందోళన నిర్వహించారు. సోమవారం ఈ ప్లాట్ల కేటాయింపుపై పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



☛ మోర్తాడ్‌ మండలంలోని పాలెంకు చెందిన శ్రీపాద సువర్ణకు ఇల్లు కానీ, ఖాళీ స్థలం లేదు. ఏళ్ల నుంచి ఆమె కుటుంబం అద్దె ఇంట్లోనే ఉంటూ నివసిస్తోంది. ఇటీవల ఇందిరమ్మ ఇళ్ల స్థలాలను అర్హులైన వారికి కేటాయించాలని నిర్ణయించారు. ఇళ్ల స్థలాలకు సంబంధించి దరఖాస్తులను స్వీకరించిన అధికారులు పరిశీలన జరిపి మంత్రి ప్రశాంత్‌రెడ్డి చేతుల మీదుగా పట్టా సర్టిఫికెట్‌లను పంపిణీ చేయించారు. ఆ జాబితాలో శ్రీపాద సువర్ణ పేరు లేదు. ఇంటి స్థలం పొందడానికి అన్ని విధాలుగా అర్హత ఉన్నా ఆమెకు రాజకీయ నాయకుల దయ లేకపోవడంతో ఇంటి స్థలం దక్కలేదనే ప్రచారం జరుగుతోంది. ఇది ఒక్క సువర్ణకు ఎదురైన సమస్యే కాదు. మోర్తాడ్‌, ఏర్గట్ల మండలాల్లో ఎంతోమంది అర్హులకు ఇళ్ల స్థలాలు దక్కకపోగా అర్హత లేనివారికి ప్లాట్లు కేటాయించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



తహసీల్‌ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

ఆస్తులున్నోళ్లకే ప్లాట్లు ఇచ్చారు..



పాలెంలో ఎంతోమంది పేదలున్నా బంగ్లాలు, ఇతర ఆస్తులు ఉన్నవారికే ఇళ్లస్థలాలు కేటాయించారు. మేం కూలి పని చేసుకుని పొట్టపోసుకుంటున్నాం. మాకు ఇంత జాగా ఇస్తే గుడిసె వేసుకుని ఉంటామనుకున్నాం. మాకు అన్యాయం చేశారు. – నర్సుబాయి, పాలెం

విచారణ చేయాలి..



ఇళ్ల స్థలాలను కేటాయించే విషయంలో అక్రమాలు జరిగాయి. విచారణ జరిపించి అనర్హులను తొలగించాలి. కనీసం గూడు లేనివారికి ఇళ్ల స్థలాలను కేటాయించలేదు.అధికారులు, మంత్రి దీనికి సమాధానం చెప్పాలి. ఇళ్ల స్థలాలు ఇవ్వకపోతే ఆందోళన చేస్తాం. – తాళ్ల అన్నపూర్ణ, పాలెం

రాష్ట్రస్థాయి వ్యాసరచనలో క్షత్రియ విద్యార్థి ప్రతిభ

ఆర్మూర్‌టౌన్‌: జాతీయ విద్యా విధానం అమలులోకి వచ్చి నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో చేపూర్‌ క్షత్రియ ఇంజినీరింగ్‌ కళాశాల విద్యార్థిని లౌకిక ప్రతిభ కనబర్చింది. రాష్ట్రస్థాయిలో 'అడ్రెస్సింగ్‌ ద ఎడ్యుకేషన్‌ రోల్‌ ఆఫ్‌ ఎడ్యుకేషన్‌ రోల్‌' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో లౌకిక ద్వితీయ స్థానంలో నిలిచింది. హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్‌ తమిళిసై సౌందరరాజన్‌ లౌకికను ప్రశంసాపత్రంతో సత్కరించారు. తమ కళాశాల విద్యార్థిని రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చడంతో యాజమాన్యం, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.



గవర్నర్‌ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న లౌకిక

వైష్ణవ ఆలయాలకు పోటెత్తిన భక్తులు

నిజామాబాద్‌ సిటీ: శ్రావణ చివరి శనివారం కావడంతో జిల్లాలో వైష్ణవ ఆలయాలకు భక్తులు పోటెత్తారు. జిల్లాలోని ప్రముఖ పుణ్య క్షేత్రాలు మోపాల్‌ మండలం నర్సింగ్‌పల్లిలో ఇందూరు తిరుమల ఆలయం, నగరంలోని జెండా బాలాజీ, ఆర్యనగర్‌ శ్రీ వేంకటేశ్వర ఆలయం, ఖిల్లా, సుభాష్‌నగర్‌లోని రామాలయాలు, మాక్లూర్‌ మండలంలో అపురూప వేంకటేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడాయి. అనంతరం ఆలయాల్లో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

కిక్కిరిసిన సారంగపూర్‌ హనుమాన్‌ ఆలయం

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన సారంగపూర్‌ హనుమాన్‌ ఆలయానికి శ్రావణ చివరి శనివారం కావడతో భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చారు. తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన భక్తులు సారంగపూర్‌ హనుమాన్‌ను దర్శించుకున్నారు. స్వామి వారి దర్శనానికి భక్తులకు రెండుగంటల సమయం పట్టింది. ఆరోటౌన్‌ పోలీసులు, నిజామాబాద్‌ మున్సిపల్‌ సిబ్బంది తగు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు శశికుమార్‌, విజయ్‌కుమార్‌, సిబ్బంది సురేశ్‌, గంగాధర్‌ తదితరులు పాల్గొన్నారు.



జెండా బాలాజీ మందిరంలో అన్నదానం

క్రైం కార్నర్‌

పాల వ్యాన్‌, స్కూటీ ఢీ : ఒకరు మృతి

ఖలీల్‌వాడి: నగరంలోని ఆర్యనగర్‌ ప్రాంతంలో పాల వ్యాన్‌, స్కూటీ ఢీ కొన్న ఘటనలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై సంజీవ్‌ శనివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ధర్పల్లి మండలం చల్లగరిగె గ్రామానికి చెందిన కిషన్‌ అతని భార్య లావణ్య(42)తో కలిసి స్కూటీపై ఆర్యనగర్‌లోని బంధువుల ఫంక్షన్‌కు వచ్చారు. తిరుగు ప్రయాణంలో వీరిని పాలవ్యాన్‌ ఢీకొన్నది. ఈ ఘటనలో కిషన్‌కు తీవ్రగాయాలు కాగా లావణ్య మృతి చెందినట్లు తెలిపారు. మహారాష్ట్రలోని షోలపూర్‌ జిల్లా సర్వొడేనగర్‌కు చెందిన డ్రైవర్‌ సైఫన్‌ భగవాన్‌గా గుర్తించినట్లు ఎస్సై చెప్పారు. మృతురాలి సోదరుడు కర్రి వెంకటచారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.



లావణ్య మృతదేహం

పరిస్థితి విషమించడంతో విద్యార్థి..



మహ్మద్‌ ఆమేర్‌ఖాన్‌ (ఫైల్‌)

కమ్మర్‌పల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఓ విద్యార్థి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన మహ్మద్‌ ఆమేర్‌ఖాన్‌ (25) బీటెక్‌ ఫైనలియర్‌ చదువుతున్నాడు. ఈ నెల 5న పరీక్షల నిమిత్తం హాల్‌ టికెట్‌ తీసుకునేందుకు హైదరాబాద్‌ వెళ్లిన ఆమేర్‌ఖాన్‌ను బండ్లగూడ ట్రాఫిక్‌ సిగ్నల్‌వద్ద గూడ్స్‌ వ్యాన్‌ ఢీకొన్నది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడడంతో నిమ్స్‌ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. బండ్లగూడ పోలీసులు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు.

చెట్టుపై నుంచి పడి వ్యక్తి ..



మృతుడు సాయిలు

కోటగిరి (రుద్రూర్‌): కోటగిరి శివారులో చెట్టుపై నుంచి ఒకరు మృతి చెందినట్లు ఎస్సై సందీప్‌ శనివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన తంబ్లూర్‌ సాయిలు (40)తో పాటు మరో ముగ్గురు ఎలక్కాయలు తీసుకొచ్చేందుకు వెళ్లారు. చెట్టు ఎక్కి కాయలు కోస్తుండగా ప్రమాదవశాత్తు సాయిలు జారి పడడంతో తీవ్ర గాయలై మృతి చెందాడు. మృతుని భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పేర్కొన్నారు.

సిర్నాపల్లిలో ఒకరిపై కేసు నమోదు

ఇందల్వాయి: సిర్నాపల్లి సర్పంచ్‌ విజయ్‌ ఇంటిపై అదే గ్రామానికి చెందిన రాజు అనే వ్యక్తి దాడి చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్‌ శనివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రాజుకి మరో వ్యక్తికి గొడవ జరగడంతో సర్పంచ్‌ సర్దిచెప్పి గొడవను సద్దుమనిగించాడు.

అందులో సర్పంచ్‌ తనకు అన్యాయం చేశాడని ఆరోపిస్తూ మద్యం సేవించి సర్పంచ్‌ ఇంటికి చేరుకొని ఇంట్లో ఉన్న పిల్లలను చంపుతానంటూ భయభ్రాంతులకు గురిచేసినట్లు తెలిపారు. ఈ విషయాన్ని గమనించిన చుట్టుపక్కలవారు రాజుని అదుపు చేసి పోలీసులకి సమాచారం అందించారు. సర్పంచ్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలు

భిక్కనూరు: మండల సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యభర్తలకు తీవ్రగాయాలైనట్లు ఎస్సై సాయికుమార్‌ తెలిపారు. రాజంపేట మండలం పొందుర్తి గ్రామానికి చెందిన వడ్ల విరాట్‌– కమ్మరి ఐశ్వర్య ద్విచక్రవాహనంపై హైదరాబాద్‌ నుంచి పొందుర్తి గ్రామానికి వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి వేగంగా ఢీకొన్నది. ఈ ఘటనలో విరాట్‌, ఐశ్వర్యలకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు కామారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆలయంలో చోరీ

నందిపేట్‌ (ఆర్మూర్‌): నందిపేట మండల కేంద్రంలోని దేవమ్మ ఆలయంలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు గర్భగుడి తాళాలు ధ్వంసం చేసి చోరీకి పాల్పడ్డారు. హుండీని ధ్వంసం చేసి నగదును దోచుకెళ్లారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

ఖలీల్‌వాడి: నగరంలోని మూడోటౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో సర్వ సమాజ్‌ గణేశ్‌ మండలి వద్ద పేయింటింగ్‌ వేస్తున్న సురేశ్‌(39) విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్‌ తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

స్నేహం కుదిరింది



మాచారెడ్డి: కుక్క, కోతి జాతి వైరం మరిచి స్నేహంగా మెలుగుతూ కుల, మత భేదాల కారణంగా కొట్టుకు చస్తున్న మనుషులకు స్ఫూర్తిగా నిలిచాయి. జాతి వైరాలు తమకు లేవంటూ సఖ్యతగా మెలుగుతున్న ఈ రెండు మూగ జీవాలు మండలంలోని గజ్యానాయక్‌తండా చైరస్తాలో శనివారం సాక్షి కెమెరాకు దొరికాయి.

డాక్‌ ఘర్‌ నిర్యత్‌ కేంద్రాల ఏర్పాటు



నిజామాబాద్‌ తపాలా శాఖ

నిజామాబాద్‌ సిటీ: విదేశాలకు వస్తువులను ఎగుమతి చేసేందుకు భారత తపాలా శాఖ ఆధ్వర్యంలో డాక్‌ నిర్యత్‌ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ మేరకు శనివారం నిజామాబాద్‌ పోస్టల్‌ సీనియర్‌ సూపరింటెండెంట్‌ ఎన్‌. అనిల్‌కుమార్‌ వివరాలు వెల్లడించారు. నిజామాబాద్‌, కామారెడ్డి పట్టణాల ప్రజలు తక్కువ ఖర్చుతో డాక్‌ నిర్యత్‌ కేంద్రాల ద్వారా విదేశాలకు వస్తువులను ఎగుమతి చేసే సంస్థల ద్వారా పంపించేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఇంపోర్ట్‌ ఎక్స్‌పోర్టు లైసెన్స్‌ ఐఈసీ కోడ్‌ కలిగిన సంస్థలు ఈ డాక్‌ నిర్యత్‌ కేంద్రాల ద్వారా సులభంగా అతి తక్కువ ధరలో తమ వస్తువులను విదేశాలకు ఎగుమతి చేసుకోవచ్చని తెలిపారు. అలాగే ఫ్రీ హోం పికప్‌తో పాటు అతి తక్కువ ధరలో పార్సెల్‌ ప్యాకింగ్‌ యూనిట్‌తో ఎగుమతి వస్తువులను ప్యాక్‌ చేయడ జరుగుతుందన్నారు. భారత తపాలా శాఖ జాయింట్‌ పార్సెల్‌ ప్రాడక్ట్‌ పేరుతో రైల్వే బోర్డు ద్వారా వీటిని డెలివరీ చేయనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు దగ్గరలోని పోస్టాఫీస్‌ను సంప్రదించాలని సూచించారు.

చక్కెర ఫ్యాక్టరీని రైతులకు అప్పగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్‌సీఎస్‌ఎఫ్‌ పరిరక్షణ కమిటీ చైర్మన్‌ కొండల సాయిరెడ్డి

నిజామాబాద్‌ రూరల్‌: సారంగాపూర్‌ చక్కెర కర్మాగారాన్ని రైతులకు అప్పగించాలని నిజాం షుగర్‌ ఫ్యాక్టరీ (ఎన్‌సీఎస్‌ఎఫ్‌) పరిరక్షణ కమిటీ చైర్మన్‌ కొండల సాయిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సహకార చట్టంలోని 95వ యాక్ట్‌ ప్రకారం ఎన్‌సీఎస్‌ఎఫ్‌ను వాటదారులైన రైతులకు అప్పగించాలని, ఇందుకు అవసరం అయిన రూ.50 లక్షలను రైతుల వాటాగా చెల్లించడానికి ఎన్‌సీఎస్‌ఎఫ్‌ పరిరక్షణ కమిటీ సిద్ధంగా ఉందన్నారు. త్వరలోనే చెరుకు రైతులందర్ని ఏకం చేసి 500 ట్రాక్టర్‌లతో నిరసన ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అవసరం అయితే న్యాయ పోరాటాలు చేసైన ఫ్యాక్టరీని తెలిపించేలా చేస్తామన్నారు. కమిటీ ప్రతినిధులు గంగారెడ్డి, నారాయణరెడ్డి, ఆకుల పాపయ్య, భూమయ్య, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతుల జాబితా విడుదల

నిజామాబాద్‌అర్బన్‌: ఉపాధ్యాయుల పదోన్నతులకు సంబంధించిన జాబితాను విద్యాశాఖ శనివారం విడుదల చేసింది. విద్యాశాఖ కార్యాలయంలో జాబితాను ప్రదర్శించారు. మొత్తం జిల్లా వ్యాప్తంగా 230 మంది పదోన్నతులకు అర్హులుగా గుర్తించారు. ప్రస్తుతం ఈ జాబితాకు సంబంధించి అభ్యంతరాలను సేకరిస్తున్నారు. ఆదివారం వరకు అభ్యంతరాలను సేకరించి సోమవారం పరిశీలన చేసి తుది జాబితాను విడుదల చేయనున్నారు.

'గమ్యం'తో ప్రయాణం సులభతరం

- బస్సు కోసం వేచి చూడాల్సిన పని లేదు
- సరికొత్త ఫీచర్లతో మహిళా ప్రయాణికులకు పెద్దపీట
- అత్యవసర సేవలకు డయల్‌ 100, 108 అనుసంధానం

ఖలీల్‌వాడి: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడానికి టీఎస్‌ ఆర్టీసీ 'గమ్యం' యాప్‌ను రూపొందించింది. ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ ఎప్పటికప్పుడు సరికొత్త రాయితీలు ప్రకటిస్తూ.. కొత్త కార్యక్రమాలను చేపడుతూ ప్రయాణికులకు చేరవవుతోంది. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రవేశపెట్టిన ఈ యాప్‌లో తాము చేరాల్సిన బస్సు ఏ ప్రాంతంలో ఉందో, ఎప్పుడు గమ్యానికి చేరుతామో వంటి సమాచారాలు నిక్షిప్తమై ఉంటాయి. ఆగస్టు12న ఆర్టీసీ యాజమాన్యం రాష్ట్రవ్యాప్తంగా ఈ బస్సు ట్రాకింగ్‌ యాప్‌ను ప్రవేశపెట్టింది. ఈ యాప్‌ సహాయంతో తాము ప్రయాణించాల్సిన బస్సు ఎక్కడుందో ఇట్టే తెలుసుకోవచ్చు. ఇదివరకు జీపీఎస్‌, టీఎస్‌ఆర్టీసీ పేరుతో యాప్‌ ఉన్నా ప్రస్తుతం సరికొత్త ఫీచర్లతో మహిళా ప్రయాణికులకు పెద్దపీట వేస్తూ ఆర్టీసీ కొత్త యాప్‌ను అందుబాటులో తీసుకొచ్చింది. దీంతో ఈ యాప్‌తో జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇకపై నిరీక్షణకు తెర

యాప్‌రాక ముందు ప్రయాణికులు గంటల తరబడి బస్టాండ్‌లో వేచి ఉండాల్సి వచ్చేది. విచారణ కేంద్రంలో బస్సు ఎప్పుడు వస్తుందన్న సమాచారానికి సరైన సమాధానం దొరక్కపోయేది. బస్సు వస్తుందా.. ఎక్కడైన మరమ్మతులకు గురైందా అనే ప్రశ్నలకు సైతం సమాధానం ఉండేది కాదు. ఇకపై గమ్యం యాప్‌తో సమస్యలకు చెక్‌ పెట్టొచ్చు. ఈ యాప్‌లో ఎక్కాల్సిన బస్సు సమాచారం మొత్తం ఉంటుంది. చేరాల్సిన గమ్యానికి ఎన్ని గంటలు పడుతుంది, ఏ ప్రాంతంలో బస్సు ఉంది, బస్సు నంబర్‌, డ్రైవర్‌ ఫోన్‌ నంబర్‌ సమాచారం ఉంటుంది. ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లాలోని ఆరుడిపోల్లోని పల్లెవెలుగు బస్సులకు మినహా ఎక్స్‌ప్రెస్‌, సూపర్‌లగ్జరీ, రాజధాని, గరుడ వంటి వాహనాలకు యాప్‌ వివరాలను అనుసంధానం చేశారు.



మహిళా ప్రయాణికులకు పెద్దపీట..

మహిళలకు గమ్యం యాప్‌లో కొత్త ఫీచర్‌ను ఆర్టీసీ అందుబాటులోకి తీసుకొచ్చింది.రాత్రి వేళల్లో బస్సు స్టాప్‌ లేని ప్రాంతాల్లో ఈ యాప్‌లో ఫీచర్‌ అయిన ఫ్లాగ్‌ ఏ బస్‌లో సమాచారం నమోదు చేస్తే ఆ బస్సు ఆగేందుకు ఏర్పాటు చేశారు. దీంతో రాత్రివేళలో మహిళలకు భద్రత ఈ యాప్‌ ద్వారా కల్పించారు. రాత్రి 7 నుంచి ఉదయం 6 గంటల వరకు అందుబాటులో ఉండే ఈ ఫీచర్‌లో మహిళా ప్రయాణికులు వివరాలు నమోదు చేస్తే ఆకుపచ్చ లైట్‌ వస్తుంది.ఈ లైట్‌ను బస్సు డ్రైవర్‌కు చూపిస్తే బస్సును తక్షణమే ఆపుతారు. దీంతో సురక్షితంగా గమ్యస్థానానికి వెళ్లేందుకు అవకాశం ఏర్పడుతుంది.

పోలీసులకు సమాచారం..

ఈ గమ్యం యాప్‌తో అత్యవసర పరిస్థితిలో బటన్‌ ద్వారా కాల్‌ సెంటర్‌ను సంప్రదించే అవకాశం ఉంది. డయల్‌ 100, 108కి ఈ యాప్‌ను అనుసంధానం చేశారు. దీంతో నేరుగా పోలీసులకు సమాచారం అందుతుంది. ఏదైనా ప్రమాదం చోటు చేసుకుంటే 108కు సమాచారం వెళ్తుంది. రోడ్డు ప్రమాదం, బ్రేక్‌ డౌన్‌, అత్యవసర పరిస్థితిలో వైద్యసాయానికి ఈ యాప్‌ ద్వారా నివేదించవచ్చు. గూగుల్‌ప్లే స్టోర్‌, ఆపిల్‌ స్టోర్‌ నుంచి యాప్‌ను డౌన్‌లోడ్‌ చేసుకోవచ్చు. ఇందులో తెలుగు, ఇంగ్లీష్‌లో వివరాలను నమోదు చేసుకునే అవకాశం ఉంది.

గమ్యం యాప్‌తో ఎంతో మేలు



ప్రయాణికులు గమ్యం యాప్‌ ను ఉపయోగించుకోవాలి. ఈ యాప్‌లో బస్సు ఎక్కడ ఉంది, కండక్టర్‌, డ్రైవర్‌ వివరాలు అందుబాటులో ఉంటాయి. మహిళా ప్రయాణికులకు ఆర్టీసీ పెద్దపేటవేసిందనడంలో ఎలాంటి సందేహం లేదు. మహిళలకు రాత్రి 7 నుంచి ఉదయం 6 గంటల వరకు ఫ్లాగ్‌ ఏ బస్‌ ద్వారా ఎక్కడైనా బస్సు ఎక్కడానికి అవకాశం ఉంది. ప్రయాణికులకు సమయభావనకు తోడ్పడుతుంది.
– జానీరెడ్డి, ఆర్టీసీ రీజినల్‌ మేనేజర్‌, నిజామాబాద్‌

గల్ఫ్‌ బోర్డును ఏర్పాటు చేయాలి

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి గల్ఫ్‌ వలస కార్మికుల ప్రయోజనాలను కాపాడాలని వినతి

మోర్తాడ్‌(బాల్కొండ): పసుపు రైతుల ప్రయోజనాలను కాపాడటానికి కేంద్రం ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయడానికి సుముఖత వ్యక్తం చేసిన నేపథ్యంలో వలస కార్మికులు గల్ఫ్‌ బోర్డు ఏర్పాటుకు పట్టుబడుతున్నారు. గల్ఫ్‌ దేశాలకు వలస వెళ్తున్న కార్మికులు వారి కుటుంబాలకు ప్రత్యేక పథకాలు అందించడానికి గల్ఫ్‌ బోర్డు ఏర్పాటు ఒక్కటే మార్గమనే అభిప్రాయాన్ని వలస కార్మికులు వ్యక్తం చేస్తున్నారు. గల్ఫ్‌ వలసలు ఎక్కువగా ఉన్న తెలంగాణలో కార్మికుల కోసం ఇప్పటి వరకు ప్రత్యేక కార్యాచరణ ఏది లేకపోవడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. కేరళ, పంజాబ్‌ రాష్ట్రాల్లో వలస కార్మికులకు అక్కడి ప్రభుత్వాలు ప్రత్యేక ప్రణాళికలను అమలు చేస్తున్నాయి. ఎన్‌ఆర్‌ఐ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి వలస కార్మికులకు ఎన్నో రకాల సంక్షేమ, పునరావాసం, పునరేకీకరణ అమలు చేస్తోంది. తెలంగాణ రాష్ట్రం నుంచి దాదాపు 15లక్షల మంది గల్ఫ్‌ దేశాలకు వలస వెళ్లారు. ప్రతి నెలా రూ. కోట్ల విదేశీ మారక ద్రవ్యాన్ని వలస కార్మికులు మన దేశానికి చేరుస్తున్నారు. విదేశాలకు వలస వెళ్లిన వారిలో ఎక్కువ ఆదాయం సమకూరుస్తుంది గల్ఫ్‌ వలస కార్మికులే కావడం విశేషం. కరోనా విపత్కర పరిస్థితుల నుంచి బయటపడిన తరువాత వలసలు పెరగడం గమనార్హం. స్థానికంగా ఉపాధి లేకపోవడం గల్ఫ్‌ దేశాల్లో ఉపాధి అవకాశాలు విస్తృతం కావడంతో వలసదారుల సంఖ్య గతంలో కంటే ఎక్కువ పెరిగింది. గల్ఫ్‌ బోర్డు ఏర్పాటు చేస్తే వలస వెళ్లే కార్మికులకు ఎంపిక చేసుకున్న రంగాల్లో శిక్షణ ఇచ్చి సక్రమ మార్గంలో వీసాల జారీ వలస వెళ్లడానికి ఆటంకాలు లేకుండా చేయడం జరుగుతుంది. వలస కార్మికులు నకిలీ ఏజెంట్ల చేతుల్లో మోసపోకుండా ఉండటానికి నిఘా పటిష్టం చేయడానికి అవకాశం ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయం చేసుకుని గల్ఫ్‌ బోర్డు ఏర్పాటుపై దృష్టి సారించాలని వలస కార్మికుల సంఘాలు కోరుతున్నాయి.

కార్మికులను పట్టించుకోవాలి




వలస కార్మికుల సంక్షేమం గురించి పట్టించుకోవాలి. కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోకపోతే అర్థం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండు సమన్వయం చేసుకుని వలస కార్మికుల కోసం కార్యాచరణ చేపట్టాలి. ఉపాధి నిమిత్తం వలస వెళ్లే కార్మికులపై స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.
– తోట రమేశ్‌, ప్రవాసి మిత్ర లేబర్‌ యూనియన్‌ కో ఆర్డినేటర్‌(బహ్రెయిన్‌)

వలస కార్మికులతో దేశానికి ఆదాయం



వలస కార్మికులు గల్ఫ్‌ దేశాలకు వలస వెళ్లి సొంతంగా సంపాదించడంతో పాటు విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించి దేశానికి ఎంతో లాభాన్ని చేకూరుస్తున్నారు. వలసలతో వివిధ రంగాల వారికి ఉపాధి లభిస్తుంది. వలస కార్మికులతో దేశానికి ఆదాయం ఉన్నా కార్మికులకు మాత్రం ఎలాంటి లాభం లేదు.
– శివన్నోళ్ల రాజు, కువైట్‌ రిటర్నీ(ఏర్గట్ల)

అలరించిన ఇంద్రధనస్సు



సిరికొండ: మండల కేంద్రంలో శనివారం సాయంత్రం ఇంద్రధనుస్సు అలరించింది. దట్టమైన మేఘాలు ఏర్పడి వాటిలో ఘనీభవించిన నీటి బిందువులపై సూర్యకిరణాలు పడినప్పుడు ఇలాంటి దృశ్యం ఆవిష్కృతమవుతుంది. మంచు బిందువులపై పడిన కిరణాలు పరావర్తనం చెంది ఇలా ఇంద్రధనస్సు రంగుల్లో కనిపిస్తాయని నిపుణులు పేర్కొన్నారు.